నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | జులై 19, 2024 | www.navatelangana.com
1

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-భైంసా

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో వారి తరపున పోరాటం చేస్తానని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. గురువారం ఆశా వర్కర్లు సిఐటియు ఆధ్వర్యంలో తమ నిరసనల్లో భాగంగా ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కరోనా కాలంలో ఆశా వర్కర్లు ఎంతో కష్టపడ్డారని, వారి సేవలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఆశా వర్కర్‌లకు న్యాయం చేస్తామన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకురానున్నట్లు చెప్పారు. ఏడు నెలలైనా కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. హామీలు విస్మరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ సర్కార్‌కు రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో పుస్తకావిష్కరణ

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కె. వీరస్వామి, అధ్యాపకురాలు బి. జ్యోత్స్నరాణి 'బేసిక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్' అనే పుస్తకాన్ని రచించారు. గురువారం కళాశాలలో ఆ పుస్తకాన్ని ప్రిన్సిపాల్ స్వామి ఆవిష్కరించారు. ఈ పుస్తకం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉందని కళాశాల సిబ్బంది, ప్రశంసించి రచయితలు వీరస్వామి జ్యోత్స్నరాణిలను అభినందించారు. కార్యక్రమంలో విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, మాసయ్య, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, అధ్యాపకులు మురళీకృష్ణ, కుమారస్వామి, సంగీత, విజయలక్ష్మి, యశశ్రీ, శ్రీనివాస్, రామేశ్వర్‌రెడ్డి, సుధాకర్, నీల్ కమల్, హేమలత, సంజయ్‌సింగ్, సంతోష్, కార్యాలయ సిబ్బంది ప్రవీణ్, కిషోర్, రాజన్న, ఎజాజ్, శృతి, అహల్య శ్రీనివాస్ పాల్గొన్నారు.



రుణ మాఫీపై బ్యాంకు మేనేజర్‌లతో కలెక్టర్ సమావేశం



నవతెలంగాణ-నిర్మల్

రైతు రుణ మాఫీ - 2024కు సంబంధించి జిల్లాలోని వివిధ బ్యాంకు శాఖల మేనేజర్‌లతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణ మాఫీ అమలుకు శ్రీకారం చుట్టిందని, అందులో భాగంగా గురువారం సాయంత్రం 4గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించబోతున్నారని తెలిపారు. మొదటి దశలో రూ.1లక్ష వరకు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ జరుగుతుందన్నారు. రుణమాఫీకి సంబంధించిన నిధులు రైతు ఖాతాల్లో జమ చేయడంలో ఎటువంటి సమస్యలు లేకుండా బ్యాంక్ మేనేజర్‌లు వ్యవసాయ శాఖాధికారులతో కలిసి పని చేయాలని సూచించారు. జిల్లాలో మొత్తం 30,106 మంది రైతులకు రూ.171.76 కోట్లు మొదటి దశ రుణ మాఫీ కింద జమ చేయడం జరుగుతుందని, ఎలాంటి సమస్యలు తలెత్తే ఆస్కారం లేకుండా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్, వివిధ బ్యాంకు శాఖాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

తమ కాలనీకి కరెంట్ సౌకర్యం కల్పించాలని కుమురం భీం కాలనీవాసులు గురువారం విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్.చవాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు గోడం గణేష్ మాట్లాడుతూ మానవతా దృక్పథంతో స్పందించి వెంటనే విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. దీనికి ఎస్ఈ స్పందించి సమస్యను ప్రభుత్వం, సీఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మెస్రం దినేష్ పలువురు ఆదివాసులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజా పాలన ఆరు గ్యారంటీల అమలులో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలు రాని దరఖాస్తుదారులు ప్రజా పాలన సేవా కేంద్ర ద్వారా డేటా సవరణ(కరెక్షన్) చేసుకోవచ్చని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం సిపిఓ కార్యాలయంలో ప్రజా పాలన సేవా కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన ఆరు గ్యారెంటీలలో భాగంగా గృహజ్యోతి, మహాలక్ష్మి ద్వారా అమలవుతున్న రూ.500కే గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా స్కీముల కోసం దరఖాస్తు చేసుకున్న వారు డేటా సవరణ కోసం ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి డేటా సవరణ చేసుకొని లబ్ది పొందాలన్నారు. ఈ సేవా కేంద్రాలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. ప్రభుత్వ సెలవు రోజులలో ఈ సేవా కేంద్రాలు అందుబాటులో ఉండవని అన్నారు. డేటా సవరణ కోసం వెళ్లే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్ కార్డ్, ఆధార్ కార్డు, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, ఎల్పిజి కస్టమర్ ఐడి, మొబైల్ నెంబర్ తీసుకెళ్లాలని సూచించారు.

వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి

నవతెలంగాణ-లోకేశ్వరం

వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ సక్రియ నాయక్ అన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను తప్పని సరిగా కలిగి ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లోనూ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను నడపడానికి అనుమతించకూడదని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడితే తల్లిదండ్రులు లేదా వారి సంరక్షులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే అటువంటి నేరాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్, గంజాయి, సిగరెట్స్, మద్యపానానికి బానిసై మత్తులో అనేక నేరాలు చేస్తున్నారని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని వివరించారు.

ఐటీఐలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

ఆదిలాబాద్‌టౌన్ : ఐటిఐ కళాశాలలో రెండవ విడత ద్వారా ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు తేదీని పొడిగించినట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రొడ్డ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై 15 వరకు గడువు ఉండగా జూలై 21 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఐటిఐ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ కళాశాలలో వివిధ ట్రేడ్‌లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

పిడుగుపాటుపై అవగాహన

బోథ్ : మండలంలోని సొనాల గ్రామంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన వలస కూలీలకు పిడుగుపాటుపై జాతీయ మానవ హక్కుల కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ బాసెట్టి అవగాహన కల్పించారు. ఆకాశం నల్లటి మబ్బులతో ఏర్పడినప్పుడు పిడుగులు పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఎత్తైన ప్రాంతాలు చెట్లు, విద్యుత్ స్తంభాలపైన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్నప్పుడు పిడుగులు పడితే పాదాలపై కూర్చుని చెవులను గట్టిగా మూసుకోవాలని సూచించారు. పిడుగు పడ్డప్పుడు దాదాపుగా 30కోట్ల వాట్స్ విద్యుత్తు ప్రసారమవుతుందని తెలిపారు. ఇది మనుషులు, పశువులపై పడితే బతికే అవకాశం లేదని, అందుకే ముందు జాగ్రత్త అవసరమన్నారు.

తర్నం బ్రిడ్జి పరిశీలన

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని తర్నం వద్ద గత సంవత్సరం కుంగిన బ్రిడ్జిని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కారణంగా తాత్కాలిక వంతెన కూడా తెగి పోవడంతో వాహనదారులు చుట్టూ తిరిగి ప్రయాణం చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. 30 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కట్టిన ఈ బ్రిడ్జి ఇంతకాలం వరదలకు తట్టుకొని నిలబడిందన్నారు. ఐదేళ్ల క్రితం దెబ్బ తిన్నప్పుడే బ్రిడ్జి పనులు చేపట్టి ఉంటే ఇప్పుడు ప్రజలకు ఈ తిప్పలు తప్పి ఉండేవని అన్నారు. ముమ్మాటికి ఇది కేంద్రం, అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వానిదే తప్పిదమని తెలిపారు.

అవిశ్వాసం నెగ్గింది..!

- చేతులెత్తి మద్దతు తెలిపిన 34మంది సభ్యులు
- తీర్మానానికి బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మద్దతు
- సమావేశానికి గైర్హాజరైన కాంగ్రెస్ సభ్యులు
- మున్సిపల్ వైస్ చైర్మెన్ పదవిని కోల్పోయిన జహీర్‌రంజానీ
- నెల రోజుల ఉత్కంఠకు తెర

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పురపాలక వైస్ చైర్మెన్ జహీర్‌రంజానీపై బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణం నెగ్గింది. పదవీ కాలానికి మరో ఆరు నెలలు గడువు ఉండగానే జహీర్‌రంజానీ పదవిని కోల్పోయారు. నెల రోజులుగా ప్రధాన పార్టీల్లో తీవ్ర ఉత్కంఠకు గురిచేసిన ఈ అవిశ్వాస రగడ ఎట్టకేలకు పరిసమాప్తమైంది. అవిశ్వాస తీర్మాణంపై గురువారం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ఆర్డీఓ వినోద్‌కుమార్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కాగా.. అంతకుముందే బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు శిబిరాల నుంచి ప్రత్యేక వాహనాల్లో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అవిశ్వాసం నెగ్గడానికి 33మంది సభ్యుల బలం అవసరం కాగా.. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులతో పాటు ఎంఐఎంకు చెందిన ఓ సభ్యురాలు మద్దతు తెలిపారు. 34మంది సభ్యులు అవిశ్వాసానికి మద్ధతుగా చేతులెత్తడంతో అవిశ్వాస తీర్మాణం నెగ్గినట్లు ఆర్డీఓ ప్రకటించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఎక్స్‌అఫీసియో సభ్యుడిగా ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికీ అప్పటికే అవసరమైన సభ్యుల బలం ఉండటంతో ఆయన ఓటింగ్‌లో పాల్గొనలేదు. సమావేశానికి హాజరైనట్లు సంతకం చేసి బయటకు వచ్చారు.

34మంది సభ్యులు చేతులెత్తారు..!

మున్సిపల్ అవిశ్వాస తీర్మాణ ఘట్టం పూర్తికావడంతో నెల రోజుల ఉత్కంఠకు తెరపడింది. వైస్ చైర్మెన్‌గా వ్యవహరించిన జహీర్ రంజానీ బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్‌గా విజయం సాధించి ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. లోక్‌సభ ఎన్నికల కంటే ముందు ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. దీంతో బీఆర్ఎస్ ఆయనపై అవిశ్వాసం తీర్మాణం ప్రవేశపెట్టాలని భావించగా.. ఇందుకు బీజేపీ సభ్యులు సైతం మద్ధతు తెలిపారు. వీరితో పాటు కొందరు కాంగ్రెస్ సభ్యులు కూడా తోడయ్యారు. 33మంది సభ్యులు గత నెల 19న జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాణం నోటీసును అందించారు. విచారించిన కలెక్టర్ ఈ నెల 18న ప్రత్యేక సమావేశం నిర్వహణకు నిర్ణయించారు. తాజాగా గురువారం సమావేశం నిర్వహించగా.. 34మంది సభ్యులు చేతులెత్తి అవిశ్వాసానికి అనుకూలంగా మద్ధతు తెలిపారు. దీంతో ఇన్నాండ్లు వైస్ చైర్మెన్‌గా కొనసాగిన జహీర్‌రంజానీ ఆరు నెలల ముందుగానే పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఈ 34మంది సభ్యుల్లో బీఆర్ఎస్‌కు చెందిన వారు 19మంది ఉండగా.. బీజేపీ సభ్యులు 9మంది, కాంగ్రెస్‌కు చెందిన వారు 5మంది, ఒకరు ఎంఐఎంకు చెందిన సభ్యురాలు ఉన్నారు. అవిశ్వాసం నెగ్గడానికి 33మంది సంఖ్యాబలం అవసరం కాగా 34మంది సభ్యులు అనుకూలంగా ఉండటంతో ఎమ్మెల్యే తన ఓటును వినియోగించుకోలేదు.

నెల రోజుల ఉత్కంఠకు తెర..!

మున్సిపల్ వైస్ చైర్మెన్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టిన నాటి నుంచి ఆదిలాబాద్ రాజకీయాలు వేడెక్కాయి. అవిశ్వాసం నెగ్గాలని బీఆర్ఎస్, బీజేపీలు పట్టుబట్టగా.. వీగిపోయేందుకు కాంగ్రెస్ నాయకులు శతవిధాలా ప్రయత్నాలు చేశారు. బీజేపీకి చెందిన ఓ కౌన్సిలర్ తొలుత కాంగ్రెస్ గూటికి చేరడం..అదే రోజున తిరిగి కమలం గూటికి వెళ్లడం వంటి పరిణామం జిల్లా కేంద్రంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తిరిగి సొంతగూటికి చేరి అవిశ్వాసానికి మద్ధతుగా చేతులెత్తారు. ఈ క్రమంలో కౌన్సిలర్లను కాపాడుకునేందుకు ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ వారం రోజుల ముందే ఆ పార్టీ కౌన్సిలర్లను శిబిరానికి తరలించగా.. బీజేపీ, కాంగ్రెస్‌లు సైతం రెండు రోజుల ముందు క్యాంపులకు తరలించాయి. ఈ పరిణామాలు ఆదిలాబాద్ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. వైస్ చైర్మెన్‌ను పదవి నుంచి దింపడమే లక్ష్యంగా బీఆర్ఎస్, బీజేపీలు ప్రయత్నం చేయగా.. పదవిని కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు యత్నించారు. చివరగా బీఆర్ఎస్, బీజేపీలకు సంఖ్యాబలం అధికంగా ఉండటం..ఐదుగురు కాంగ్రెస్, ఒకరు ఎంఐఎం సభ్యులు మద్దతు తెలపడంతో వారిదే పైచేయిగా నిలిచింది. కాగా ఈ సమావేశానికి 13మంది కాంగ్రెస్ సభ్యులతో పాటు ఇద్దరు ఎంఐఎం సభ్యులు హాజరుకాలేదు. కాగా సమావేశంలో చేతులెత్తిన బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు సమావేశం అనంతరం వేర్వేరుగా బయటకు వచ్చారు. వైస్ చైర్మెన్‌ను పదవి నుంచి దించడమే లక్ష్యంగా పనిచేశామని.. ఇందుకు మిగితా పార్టీల సభ్యులు కూడా మద్ధతు ఇచ్చారని బీఆర్ఎస్ సభ్యులు తెలిపారు. కాగా బీఆర్ఎస్, బీజేపీలది అనైతిక బంధమని.. ఆ రెండు పార్టీలు ఒక్కటేననే విషయం తాజాగా తెలిపోయిందని కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.



అవిశ్వాసం నెగ్గిన అనంతరం విజయ సంకేతం చూపుతున్న బీఆర్ఎస్ చైర్మెన్, కౌన్సిలర్లు



సమావేశానికి మున్సిపల్ కార్యాలయానికి వస్తున్న బీఆర్ఎస్ కౌన్సిర్లు , బీజేపీ కౌన్సిలర్లతో వస్తున్న ఎమ్మెల్యే శంకర్

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రభుత్వం రుణమాఫీ చేసిన సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ విభాగం చైర్మెన్ సెడ్మకి ఆనంద్‌రావ్ ఆధ్వర్యంలో మాలె బోరిగామ గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వరంగల్‌లో రాష్ట్ర రైతాంగానికి రైతు డిక్లరేషన్‌లో ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ తులసీరాం పటేల్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీలో భాగంగా రూ.లక్ష మాఫీకి చర్యలు తీసుకోవడంపై మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రధాన విధుల గుండా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల నాయకులు జల్కె పాండురంగ్, శివుడు, విఠల్, శ్రీనివాస్, కిషన్ పాల్గొన్నారు.

నేరడిగొండ : తేజపూర్ గ్రామంలో రైతు రుణమాఫీ సందర్భంగా బద్దం పోతారెడ్డి ఆధ్వర్యంలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని ఆనందం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టపాకాయలు పేల్చి సంబరాలు జరిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడే వసంతరావు, బ్లాక్ అధ్యక్షులు ప్రఫుల్ చందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నాయుడు రవి, బద్దం పోతారెడ్డి, కపిల్, తొడసం శంకర్, మురళీగౌడ్, మందుల రమేష్, రాజు, మధుకర్, సుభాష్ పాల్గొన్నారు.

లోకేశ్వరం : ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు గడ్డం సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు సుందరగిరి ముత్తగౌడ్, జిల్కరి సాయిప్రసాద్, నర్సారెడ్డి, రత్నాకర్, కపిల్, గంగయ్య, దత్తు, వెంకట్రావ్, సుధాకర్, సుధీర్‌రెడ్డి, భూమన్న, నర్సింగ్‌రావ్ పలువురు రైతులు పాల్గొన్నారు.



నేరడిగొండ : ఆడే గజేందర్ ఆధ్వర్యంలో సంబరాలు



ఆదిలాబాద్‌రూరల్ : మాలె బోరిగామలో పాలాభిషేకం

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

- తొలిరోజు 28 మంది అభ్యర్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎస్సీ పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జులై 18 నుండి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థుల కోసం జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండి 11.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 వరకు రెండు సెషన్‌లలో పరీక్షలు జరిగాయి. గురువారం నిర్వహించిన తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అభ్యర్థులు సమయానికి కంటే గంట ముందుగానే కేంద్రానికి చేరుకున్నారు. వారిని సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం లోనికి పంపించారు. హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డులను పరిశీలించారు. పరీక్ష సమయం కంటే 15 నిమిషాల ముందు గేట్లను మూసి వేసి ఎవరిని కూడా అనుమతించలేదు. ఉదయం జరిగిన పరీక్షకు వంద మంది అభ్యర్థులకు 86, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు వంద మందికి 86 మంది హాజరైనట్లు పరీక్షల పర్యవేక్షకులు పున్నారావ్ తెలిపారు. ఉదయం ఎస్ఏ ఫిజిక్స్, మధ్యాహ్నం పీఈటీలకు పరీక్షలు జరిగాయని తెలిపారు.

ఆల్ ది బెస్ట్ చెప్పిన పోలీసులు

డీఎస్సీ పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు పోలీస్ శాఖ తరపున ఆల్ ది బెస్ట్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ సిబ్బంది 'ఆల్ ది బెస్ట్' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలంటూ సూచించారు. సమయానికి కేంద్రానికి చేర్చడానికి మేమున్నామంటు ట్రాఫిక్ పోలీసులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఫణిదర్, మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

ఉదారత చాటిన పోలీసులు

డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు పోలీసులు సహకారం అందించి తమ ఉదారతను చాటుకున్నారు. మధ్యాహ్నం జరిగే పరీక్ష కోసం జిల్లా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు వచ్చారు. అయితే ఆ సమయంలో వర్షం కురిసింది. దీంతో లోపలికి వెళ్లేందుకు అభ్యర్థులు ఇబ్బంది పడగా మరోవైపు సమయం అయిపోతోంది. ఈ నేపథ్యంలో అక్కడ ఉన్న మావల ఎస్ఐ విష్ణువర్ధన్, సిబ్బంది స్వయంగా వారి వాహనంలో ఎక్కించుకొని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. దీంతో వారు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

సంబరాల్లో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు

- వైస్ చైర్మన్‌గా మైనార్టీనే నియమిస్తాం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ వైస్ చైర్మెన్‌పై బీఆర్ఎస్ పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆధ్వర్యంలో సంబరాలు జరుకున్నారు. గురువారం పార్టీ కార్యాలయం ఎదుట, వినాయకచౌక్‌లో టపాసులు పేల్చి జై తెలంగాణ అంటు నినాదాలు చేశారు. జోగు రామన్నను, మున్సిపల్ చైర్మన్ ప్రేమేందర్‌ను నాయకులు భుజాన ఎత్తుకొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ మైనార్టీలకు వ్యతిరేకం కాదని, వైస్ చైర్మెన్ పాలనకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టామని తెలిపారు. వైస్ చైర్మెన్ ఆగడాలు పెరిగిపోయాయని ఆరోపించారు. పలుమార్లు వైఖరి మర్చుకోవాలని పార్టీలో ఉన్న సమయంలో సూచించడం జరిగిందన్నారు. అయినా మార్పు రాకపోగా ఇతర పార్టీలో చేరారని తెలిపారు. అయినా తన అరాచకాలు మారలేదన్నారు. దీంతో అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందన్నారు. ఇతర పార్టీ కౌన్సిలర్లు కూడా అతనితో విసుగుచెంది అవిశ్వాసానికి మద్దతు తెలిపినందుకు ధన్యవాదలు తెలిపారు. రాక్షస పాలన నుంచి విముక్తి లభించినట్టుగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. వైస్ చైర్మెన్‌గా మైనార్టీ వ్యక్తినే నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, కౌన్సిలర్లు పవన్ నాయక్, ప్రకాష్ పాల్గొన్నారు.

బీజేపీ సంబరాలు

వైస్ చైర్మెన్‌పై అవిశ్వాసం నెగ్గడంతో పట్టణంలోని వినాయక్‌చౌక్‌లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేలుస్తు నృత్యాలు చేశారు. వైస్ చైర్మెన్ అరాచకాలు పెరిగాయని ఆరోపించారు. ఆయనను దించడంలో సహకరించిన కౌన్సిలర్లకు పార్టీ శ్రేణులు ధన్యవాదాలు తెలిపాయి. ఎమ్మెల్యే తనయుడు శరత్‌ను భుజాన ఎత్తుకొని ఈలలు వేశారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు

మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానిపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సమీపంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. భారీ గేట్లు ఏర్పాటు చేసి మున్సిపల్ ఉద్యోగులతో పాటు కౌన్సిల్ సభ్యులను మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతించారు. 163 సెక్షన్ నిబంధన అమలు చేశారు. వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట రహదారిని మూసివేసి ట్రాఫిక్‌ను దారి మళ్లించారు. ఎస్పీ గౌస్ ఆలం సందర్శించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు ఫణిదర్, సత్యనారాయణ, కరుణాకర్‌రావ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.



బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని తేలిపోయింది : శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ వైస్ చైర్మెన్ అవిశ్వాసంలో మరోసారి బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని తేలిపోయిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రజాసేవభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పెట్టిన అవిశ్వాస తీర్మానానికి బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్ తన కౌన్సిలర్లతో కలిసి హాజరు కావడం నిదర్శమన్నారు. రాష్ట్ర స్థాయిలో బీఆర్ఎస్, బీజేపీకి విలీనానికి వైస్ చైర్మెన్ అవిశ్వాసం నాంది అయిందన్నారు. వైస్ చైర్మెన్ పీఠాన్ని బీజేపీకి కట్టబెట్టడానికి బీఆర్ఎస్ ఈ నాటకం ఆడిందని ఆరోపించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో 49 వార్డులకు 40 వార్డుల్లో విజయం సాధించి మున్సిపల్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అదే విధంగా అవిశ్వాసంలో తమకు మద్దతు తెలిపిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసికి ధన్యవాదలు తెలిపారు. అధిష్టానం నిర్ణయం మేరకు వారితో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అదే విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీకి సీఎం రేవంత్‌రెడ్డి 31వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. గురువారం నుంచే లక్ష రూపాయల రుణమాఫీ జరుగుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తున్నామని పేర్కొన్నారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తామని చెప్పిన హరీష్‌రావ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-నేరడిగొండ

ఆరు నెలల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఇలాంటి దురదృష్టకర సంఘటన పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్‌టి.రమణ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు



సత్య నారాయణ మాట్లాడారు. మాట్లాడారు. రామభద్రపురం మండలంలో ఇటీవల ఆరేండ్లే బాలిక ఊయలలో ఉండగా అత్యాచారానికి పాల్పడిన సంఘటన దురదృష్టకరమని అన్నారు. హత్యలు అత్యాచారాలు, మద్యం, గంజాయి, నీలి చిత్రాల ప్రభావంతోనే జరుగుతున్నాయన్నది అనేక కేసుల్లో రుజువైందని, అటువంటి వాటిని కూడా నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు.

కనక యాదవరావుకు సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

ఇటీవల ఆదివాసీ సంఘాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కనక యాదవరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, ఆదివాసీ సంఘాల రాష్ట్ర అధికార ప్రతినిధులు కుమ్ర వినాయకరావు, సిడం సోనేరావు, కనక ఆనంద్‌రావు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ ఆదివాసుల హక్కులు, అస్థిత్వం, ఆదివాసీ జాతి అభ్యున్నతి కోసం పోరాటం చేయాలని సూచించారు. సన్మానించిన ప్రతినిధులకు కనక యాదవరావు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ పటేల్ ఉన్నారు.



రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎడ్లబండి నడిపి రైతులను ఉత్సాహపరిచిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-దస్తురాబాద్

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని బుట్టాపూర్, రేవోజీపేట, మున్యాల, దస్తురాబాద్ గ్రామాలలో రైతులతో కలిసి రైతువేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతు సంక్షేమంలో భాగంగా, రైతు రుణమాఫీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. దేశంలో మొట్టమొదటిసారిగా రైతులకు ఒకేసారి రెండు లక్షల రూపాయలు మాఫీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం వల్లనే సాధ్యమని అన్నారు. గత ప్రభుత్వాలు రుణమాఫీ చేయడానికి పది సంవత్సరాల కాలం పట్టించి, రైతాంగాన్ని దివాలా తీసిందని అన్నారు. మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేష్, యూత్ అధ్యక్షులు నరేష్, పీఏసీఎస్ చైర్మెన్ రామడుగు రమేష్‌రావు శైలజ, మాజీ ఎంపీపీ కిసాన్, మాజీ జెడ్పీటీసీ శారదా శ్రీనివాస్, ముడికే శ్రీనివాస్, రంజిత్, శివయ్య, పుల్యానాయక్, స్వామి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నార్నూర్ : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోథ్ గజానంద్ నాయక్, పార్టీ మండలాధ్యక్షుడు దేవ్‌రావ్ లోఖండే అన్నారు. గురువారం ప్రభుత్వం రైతు రుణమాఫీ విడుదల చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మండల కేంద్రంలో రైతులతో కలిసి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తుందన్నారు. అదేవిధంగా మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ అదికారులు ఆయా గ్రామాల రైతుల రుణమాఫీ విడుదలపై అవగాహన కల్పించారు. రైతు రుణమాఫీ విడుదల సందర్భంగా గ్రామంలో రైతులతో కలిసి ర్యాలీ తీసి రుణమాఫీ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏఓ రమేష్, ఏఈఓలు రాజేశ్వర్, సాయికృష్ణ, సైజాన్, నిఖిల్, నరేష్, బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ సునీల్, జిల్లా సార్మెడి దుర్గు పటేల్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : నేటి నుంచి రూ.2 లక్షల వరకు ఏక కాలంలో పంట రుణ మాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం ఉట్నూర్‌లో ఎడ్లబండ్లతో రైతులు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఆత్రం సుగుణలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను నేడు అమలు చేసి రైతులకు భరోసా కల్పించామని అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చేయని రుణమాఫీలను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉండి ఒక లక్షా వరకు మాఫీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

కుభీర్ : ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన మాట ప్రకారం రుణమాఫీ చేసినందున గురువారం మండలంలోని 41 గ్రామ పంచాయతీల రైతులు ఆయా గ్రామాల్లో సంబరాలు నిర్వహించుకున్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు బషీర్, జైరాం ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అదే విధంగా ప్రజా ప్రభుత్వంలో ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి విడత కింద రైతులకు రూ.1లక్ష రుణమాఫీ చేసిందని అన్నారు. మిగిలిన రైతులకు కూడా రెండో విడత కింద రూ.1లక్ష 50వేలు ఈనెల చివరి వారంలో మాఫీ చేస్తుందని అన్నారు. ఆగస్టు చివరి వరకు రూ.2లక్షల పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ చేసి రైతులకు మేలు చేసేందుకు కాంగ్రెస్ ముందుకు వెళుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్, హనుమల్లు, వివేకానంద, విలాస్ సాయబ్‌రావు బంక బాబు, జావిద్‌ఖాన్ ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, రైతులు ఉన్నారు.

ఇంద్రవెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు రుణ మాఫీ చేయడంతో రైతులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక రైతు వేదికలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు మార్కెట్ యార్డు వరకు ఎడ్లబండ్లతో ర్యాలీ నిర్వహించారు. రైతుల రుణ మాఫీ చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. మండలంలో మొత్తం 1247 మందికి రుణమాఫీ చేసినట్లు అధికారులు తెలిపారు. దశలవారీగా మిగతా రైతుల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ.అరుణ, సిబ్బంది కరుణ, నాయకులు యాకుబ్‌బేగ్, ఉత్తం ముఖాడే, సోమూరే నాగోరావ్ పాల్గొన్నారు.

ముధోల్ : మండల కేంద్రంలో గురువారం సాయంత్రం రైతువేదికలో రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. రైతు వైదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, తెలంగాణ జన సమితి ముధోల్ ఇన్‌చార్జి సర్దార్ వినోద్, నాయకులు అఫ్రోజ్ ఖాన్, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గంగారెడ్డి, ప్రేమానంద్‌రెడ్డి, గోవింద్ పటేల్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మాజీ జెడ్పీటీసీ పత్తి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బొల్లోజి నర్సయ్య అన్నారు. రైతు రుణమాఫీ నేపథ్యంలో గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. గత ఎన్నికల హామీ మేరకు రైతులకు రుణమాఫీ ప్రారంభించామని తెలిపారు. అందులో భాగంగానే రూ. లక్ష వరకు రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు. విడుతల వారిగా రెండు లక్షల రుణమాఫీ చేడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, అధికారులు రైతులు పాల్గొన్నారు.









ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ మాట్లాడుతూ ఆశాలు వెట్టిచాకిరి వేతనంతో విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. ఒక రోజు సమయానికి విధులకు హాజరు కాకపోతే మీరు డ్యూటీకి రావద్దని పైఅధికారుల ఒత్తిడి ఉన్నాయని అన్నారు. ఆశ వర్కర్లకు నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తప్పకుండా ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనుసూయ, గంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసమే అలంకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులకు ఆత్మవిశ్వాసం అలంకరణ వంటిదని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. గురువారం పట్టణంలోని చావార అకాడమీలో నిర్వహించిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ చదువు కేవలం ఉన్నత పదవులు పొందడానికి కాదు మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి కూడా ఉపయోగపడుతుందని తెలిపారు. కేవలం పరీక్షలు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించవని వారి నడవడిక ఆత్మవిశ్వాసం అనుకున్నది సాధించేలా చేస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టామీ జీస్ పాల్, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక మార్పులపై డ్రైవర్లకు శిక్షణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బస్సుల్లో వస్తున్న సాంకేతిక మార్పులపై ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణలను అందిస్తున్నామని ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్ అన్నారు. గురువారం డీఎం కార్యాలయంలో బీఎస్ సిక్స్ వాహనాల నియంత్రణ, డ్రైవింగ్ అంశాలపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సాకేంతిక మార్పుల కారణంగా బస్సు ఏ విధంగా నడపాలో వివరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం సోలోమన్ మాట్లాడుతూ పెరుగుతున్న సాకేంతికతను ఆర్టీసీ కూడా అందిపుచ్చుకుంటూ కొత్త బస్సులను అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. ఈ క్రమంలో డ్రైవర్లకు బస్సులు నడపడంపై అవగాహన కల్పిస్తూ సురక్షితంగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చేలా శిక్షణలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎం కల్పన, ఆర్‌ఎం ఆఫీస్ ఎంఎఫ్సీ రాజేందర్, ఆదిలాబాద్ సేఫ్టీ వార్డెన్ విష్ణు, నిర్మల్, భైంసా, మంచిర్యాల సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు అసదుల్లా, బర్కతుల్లా, సతయ్య ఉన్నారు.

ఆదిలాబాద్‌లో రేవంత్‌రెడ్డి పర్యటన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో గురువారం ఏర్పాట్లను కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం పరిశీలించారు. పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రిమ్స్‌లో ఏర్పాటు చేసిన మహిళ శక్తి క్యాంటిన్, ఎంఆర్‌ఐ పరికరాన్ని ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రిమ్స్ సూపర్ స్పెషలిటీలోని మహిళ శక్తి క్యాంటిన్‌తో పాటు ఎంఆర్‌ఐ మిషన్ తదితర వాటిని కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. ప్రారంభానికి వచ్చే సీఎంకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రారంభోత్సవానికి సంబంధించి ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు పెట్టాలని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను ఆదేశించారు. అనంతరం సీఎం బస, సమావేశాలు, లంచ్ తదితర వాటికి టీటీడీసీ, ఆఫీసర్స్ క్లబ్ లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, డీఎస్ఓ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, డీఎస్పీలు జీవన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ ఉన్నారు.

కుక్కల బెడద నుంచి కాపాడాలి

నవతెలంగాణ-కుభీర్

కుక్కల బెడద నుంచి కాపాడాలని గురువారం మండల కేంద్రానికి చెందిన సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల చైర్మెన్ పండరి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా సోషల్ జస్టిస్ పర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిలర్స్ పండరి మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఆయా వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువ ఉండటంతో వాటి నుంచి రక్షించాలన్నారు. అందులో ముఖ్యంగా గ్రామపంచాయతీ కార్యాలయానికి దగ్గరలో మూడు పాఠశాలలు ఉన్నాయని, వందలాది విద్యార్థులు చదువుతున్నారని, విద్యార్థులు తల్లిదండ్రులు కుక్కలకు చూసి భయపడుతున్నారని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉపాధ్యాయులు గంగాశేఖర్, షేక్ రెహమాన్, జి సాయినాథ్, ఆర్ రాజ్‌కుమార్, గ్రామస్తులు వీర లింగం, భామని శేఖర్, సూది గంగాధర్, బి.ప్రశాంత్, బి.భోజన్న పాల్గొన్నారు.

రుణమాఫీ నేరుగా రైతులకు అందేలా చర్యలు

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతు రుణమాఫీకీ సంబంధించి గైడ్‌లైన్స్ ప్రకారం జమ అయ్యే ఋణం రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండ నేరుగా రైతులకు చేరేలా బ్యాంకర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో సమావేశం గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పంట రుణాలు పొందిన 18, 739 మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు లక్షలోపు మాఫీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న రూ. 1లక్ష లోపు లోన్ తీసుకున్న రైతులు ఋణ మాఫీ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి ఖాతాలో జమ అయిన రుణమాఫీ నేరుగా రైతులకే అందేటట్లు చూడాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రైతు వేదికలో రైతుల లిస్టు ప్రదర్శన చేయాలన్నారు. రైతులకు సంబంధించిన ఆధార్ కార్డు, పాస్ పుస్తకం తదితర డాకుమెంట్స్ తీసుకొని రెన్యూవల్ కోసం బ్యాంకుకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో రైతులకు సంబంధించి వివరాలతో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉండి రైతు రుణమాఫీ రైతులకు చేరేలా చూడాలన్నారు.

అధికారులకు రైతులు సహకరించాలి..

బ్యాంకుల వద్ద రైతులు ఆందోళనకు గురికాకుండా క్రమశిక్షణ పాటించడం కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ఇబ్బంది పడకుండా క్రాప్‌లోన్ రెన్యూవల్ చేసుకునేందుకు బ్యాంకు అధికారులకు సహకరించాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు బ్యాంకు అధికారులకు సహకారం అందించాలని, ఎలాంటి సమస్యలు ఎదురైన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అందరి సహాయ సహకారాలతో రూ.లక్ష రైతు రుణమాఫీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఎస్బిఐ రిజినల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంకు, కోఆపరేటివ్ బ్యాంకు, ఇతర బ్యాంకుల అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ జీఓలో సవరణలు చేయాలి

- ఏజెన్సీ డీఎస్సీ వేయాలని డిమాండ్
- పోడు సాగుదార్లకు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేషన్ కార్డ్‌తో సంబంధం లేకుండా రైతు రుణమాఫీ చేస్తూ, జీఓలో సవరణ చేయాలనీ, పట్టా పాస్ బుక్ ఉన్న అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయాలనీ సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని సుందరయ్య భవనవంలో సీపీఐ(ఎం) నాయకులు బండి దత్తాత్రి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ మాట్లాడుతూ పోడు సాగుదారాలకు హక్కుపత్రాల ఆధారంగా రుణమాఫీ వర్తింపజేయాలనీ అన్నారు. రేషన్ కార్డుకు సంబంధం లేకుండా జీఓలో సవరణలు చేయాలని కోరారు. అలాగే ఏజెన్సీ డీఎస్సీ వేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మెగా డీఎస్సీతో ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న హక్కు పత్రాలు ఉన్న వారందరికీ రుణమాఫీతో పాటు, రైతు భరోసా అమలు చేయాలన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, ఆర్.సురేందర్, ఆత్రం కిష్టన్న, నాయకులు లింగాల చిన్నన్న పాల్గొన్నారు.

అన్నాబావు సాఠె ఆశయాల సాధనకు కృషి చేద్దాం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

సాహిత్య సమ్రాట్ లోక్ సాహిర్ అన్నాభావు సాఠే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో అన్నాభావు సాఠే 55వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అన్నాబావు సాఠే ఎనలేని కృషి చేశారని అన్నారు. ఓ సామాన్య కుటుంబంలో జన్మించి, తాడిత పీడిత ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. దళితుల హక్కుల కోసం గళమెత్తిన మహానాయకుడని అన్నారు. సమాజాన్ని జాగృతం చేయడం కోసం నవలలు రాశారని తెలిపారు. ఆయన కొందరి వాడు కాదని అందరి వాడని, ఆ మహనీయుడి బాటలో నడవాలని పిలుపునిచ్చారు. సబ్బండ వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. త్వరలో దళితుల సమస్యలను పరిష్కారం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ : అన్నా భావు సాఠే గొప్ప సాహిత్య కారుడని, దళిత నాయకులు నర్సింగ్ మోరే, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోథ్ గజానంద్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు తాడిహత్నూర్ తదితర గ్రామాల్లో సాహిత్య సామ్రాట్ అన్నా భావు సాఠే 55వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తన సాహిత్యం రచనలతో దేశ విదేశాల్లో గుర్తింపు పొందారని అన్నారు. పేద, కార్మిక, కర్షక వర్గాల కోసం విశేషమైన కృషి చేశారని కొనియాడారు. నేటి యువత వారి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానోబా పుష్కర్, లోఖండే దేవ్‌రావ్, దస్తగిరి, జాకీరుల్లా ఖాన్, కరీం ఖాన్, షేక్ అహ్మద్, షేక్ హుస్సేన్, కోర్రల మహేందర్, వాగ్మారే బాప్‌రావ్, గోపాల్ ఇరాలె, శుభం, రాందాస్ ఉన్నారు.



ప్రజల్లో పేరు తెచ్చుకునేలా పని చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ప్రజల్లో పేరు తెచ్చుకునేలా పోలీసులు పనిచేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. బదిలీలో భాగంగా జిల్లాకు కేటాయించిన ఇద్దరు ఎస్సైలు రామకృష్ణ, నరేష్‌లు మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రెండ్లీ పోలీస్ అమలు చేస్తూనే శాంతి భద్రతల పరిరక్షణ చేయడంతో పాటు ప్రజల్లో ఉత్తమ అధికారులుగా పేరు తెచ్చుకునేలా పని చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో పరిస్థితిలతో మమేకమై పని చేయాలన్నారు. గతంలో హైదరాబాద్‌లో పని చేసిన వినూత్న అనుభవాలను జిల్లాలో అమలు చేసి నూతన విధానాలు ప్రజలు పాటించేలా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : నలుగురికి గాయాలు

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని మర్రిపల్లి మూలమలుపు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. హెడ్ కానిస్టేబుల్ ఉత్తమ్ తెలిపిన వివరాల ప్రకారం.. గిరివెల్లి గ్రామానికి చెందిన అల్లూరి శంకర్, అల్లూరి అనిల్ పని నిమిత్తం వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఏనేగూడ గ్రామానికి చెందిన ఎంగిలి రమేష్, పోశలు ఎదురెదురుగా వస్తూ ఢీ కొట్టుకోవడంతో అల్లూరి శంకర్, అనిల్, రమేష్‌లకు తీవ్ర గాయాలు కాగా పోశాలుకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యం కోసం మంచిర్యాల ప్రయివేట్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఇచ్చిన మాట తప్పం..మడమ తిప్పం

- డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్
- రుణమాఫీ విడుదల సంబరాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన మాట తప్పదని మడమ తిప్పేది లేదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేయగా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైతు వేదిక ఎదుట టపాసులు పేల్చి, రేవంత్ రెడ్డి, భట్టివిక్రమార్కుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ అమలు చేశామన్నారు. రెండు మూడో విడతల్లో పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగుతుందన్నారు. దీనిలో ఎటువంటి అపోహలు అవసరం లేదని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాలు రేషన్ కార్డు మెలిక పెట్టారంటూ అనవసర రాద్ధాంతాలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి నేరుగా తెలిపారన్నారు. పట్టా పాస్ బుక్ మాత్రమే ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ఎప్పుడు కూడా రైతుల పక్షపాతిగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, చరణ్, శ్యామ్ పాల్గొన్నారు.

దహెగాం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినందుకుగాను మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు మండలంలోని వ్యవసాయ శాఖ రెవెన్యూ బ్యాంక్ అధికారులతో కలిసి రైతులు వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లలిత, బ్యాంక్ మేనేజర్ నవీన్ కుమార్, ఆర్ఐలు నాందేవ్, శృతి, ఏఈఓలు జ్ఞానేశ్వర్, లక్ష్మి, సుస్మిత, దీపక్, ఆనంద్ రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గందె వెంకటేష్, నాయకులు సంతోష్ గౌడ్, బండ కృష్ణ, పుప్పాల సంతోష్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి గురువారం ఎమ్మెల్సీ దండే విఠల్ పాలాభిషేకం చేశారు. రైతు రుణమాఫీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశాన్ని రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు.



ఆసిఫాబాద్ : సీఎం, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కెరమెరి : మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏకకాలంలో ఒకేసారి రూ.రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీ వర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు భూస శంకర్, కాంగ్రెస్ నాయకులు హర్షద్ హుస్సేన్, హకీమ్, అన్సర్ హుస్సేన్ పాల్గొన్నారు

సిర్పూర్(టీ) : కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల ప్రతి ఒక్క పథకాన్ని దఫల్వారీగా అమలు చేస్తుందని, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ప్రతి అంశాన్ని అమలు చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అఖిల్, హుడికిలి మాజీ సర్పంచ్ పిప్రే ప్రభాకర్, మార్కెట్ కమిటీ సభ్యులు తిరుపతి, మోతిరామ్, గంగారం, అక్కుబాయి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కెరమెరి : రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆత్రం కుసుంరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రభుత్వం రైతుల రుణమాఫీ చేపడుతున్న సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. ప్రధాన రహదారి గుండా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద గల విగ్రహాల ముందు ముఖ్యమంత్రి, డిప్యూటీ ముఖ్యమంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతగా రూ. లక్ష వరకు ఉన్న రైతు రుణాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. ఆగస్టులోపు రూ. 2లక్షల వరకు ఉన్న రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయనున్నట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మునీర్ అహ్మద్, రాథోడ్ సుదర్శన్, ఆత్రం లక్ష్మణ్ రావు, శంకర్ నాయక్, బాబు నాయక్, కుతూబొద్దీన్, దండుగుల శ్రీనివాస్, జలపతి, లింబరావు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద గురువారం కిషన్ సెల్ మండల అధ్యక్షుడు మాల్యార్ మారుతి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ డుబ్బుల వెంకయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ.700 లక్షల కోట్లు అప్పు చేస్తే, తెలంగాణని సీఎం రేవంత్ రెడ్డి అప్పు తీర్చి తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తున్నారన్నారు. రూ.లక్ష వరకు ఉన్న రైతులకు రైతు రుణమాఫీ డబ్బులను విడుదల చేయడంతో రైతులు ఎంతో ఆనందకరంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డుబ్బుల నాన్నయ్య పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కొండు శంకర్, మండల యూత్ అధ్యక్షులు లాట్కారి మహేష్, మాజీ సర్పంచ్ మేకల ప్రసాద్, మాజీ ఉప సర్పంచ్ ఉప్పల మహేష్, నాయకులు మారతి, శ్రీమన్‌నారాయణ, ఇప్ప శ్రీనివాస్, రోమాజి, జాడి శంకర్, రౌతు రాకేష్ పాల్గొన్నారు.

తిర్యాణి : మండలంలోని చింతపల్లి గ్రామంలోని రైతు వేదికలో కాంగ్రెస్ నాయకులు, రైతులు తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడంతో గురువారం సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షులు బందు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్ లో తెలిపినట్లుగానే తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిత్తరి సాగర్, బొల్లం శంకర్, పెరుమాళ్ళ వెంకటేశం

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ రైతు పంట రుణమాఫీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేయడంతో మండలంలోని రైతులు ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకు ముందు రైతులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రైతు పంట రుణమాఫీ నిధులు విడుదల చేయడంతో రైతులు సంబరాలు జరుపుకున్నారు. ఇందులో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీవిద్య, లావణ్య , మాజీ సర్పంచ్ చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు రాచకొండ కృష్ణ, తిరుపతి, వాగయ్య, అత్తబేగ్, లచ్చన్న, శంకర్ గౌడ్, పురుషోత్తం, రైతులు పాల్గొన్నారు.







జిల్లాలో మొదటి విడత రుణమాఫీ పూర్తి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మొదటి విడత రుణమాఫీ పూర్తయినట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. రుణమాఫీ నిధుల విడుదల వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ జోషి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి వెంకటేష్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి వాసుదేవ్‌తో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల్లో 22 వేల రైతులు రుణమాఫీ మొదటి విడత పూర్తయిందన్నారు. రైతులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. అనంతరం రైతులకు స్వీట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈఓలు చిరంజీవి, రాము, రైతులు పాల్గొన్నారు

వేతనాలు చెల్లించాలని జీపీ కార్మికుల భిక్షాటన



నవతెలంగాణ-బెజ్జూర్

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాన్ని వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వివిధ దుకాణాల్లో భిక్షాటన చేస్తూ వారి నిరసనను వ్యక్తం చేశారు. ఆరు నెలలు గడుస్తున్న వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబం పోషించలేని పరిస్థితిలో ఉన్నామని ప్రభుత్వం స్పందించి వేతనాలను విడుదల చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గోరంట్ల వసంత్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్సీ దండే విఠల్ భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్సీ నిధుల నుండి రూ.5 లక్షలతో సీసీ రోడ్డును మంజూరు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో ఈ కాలనీవాసులకు రోడ్డు సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు అర్షద్ హుస్సేన్, అన్సర్ హుస్సేన్, రంగు సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

సేవలను గుర్తించడం హర్షణీయం

నవతెలంగాణ-వాంకిడి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను గుర్తించడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి చిందం రాజు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విస్తరణ స్థాయి సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇచ్చే విషయాన్ని ప్రకటించడం శుభపరిణామమని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దోమల మందు పిచికారి

నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని అన్ని వసతి గృహాల్లో వర్షాకాలంలో వ్యాపించే సీజన్ వ్యాధులను అరికట్టడానికి దోమల మందు పిచికారి చేస్తున్నామని సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, చికెన్ గన్యా, డెంగు వంటి వ్యాధులపై, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పరుశురాం, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన పీరీల పండుగ

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పీరీల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా పీరీల వద్ద మొక్కులను తీర్చుకున్నారు. మండలంలోని కమాన, ఇందానీ తదితర గ్రామాల్లో కూడా పండుగను ఘనంగా నిర్వహించారు.

ముందస్తు అరెస్టులు సరికావు

నవతెలంగాణ-రెబ్బెన

రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని చెప్పేసి నిరుద్యోగులే స్వచ్ఛందంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడికి పిలుపు మద్దతుగా బయలుదేరుతారని ముందస్తుగా డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి చాపిడి పురుషోత్తం, ఆత్మకూరి సతీష్‌ను ముందస్తు అరెస్టు చేశారు. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని గ్రూప్ 2, గ్రూప్ 3, పోస్టను పెంచాలని, మెగా డీఎస్సీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.వాసుదేవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులకు విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను గమనించిన వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. షాక్‌కు గురైన వ్యక్తిని వేరు చేయడానికి విద్యుత్ ప్రవహించని (కర్ర, ప్లాస్టిక్ లాంటి) వస్తువులను వినియోగించాలని తెలిపారు. నెలవారీ కరెంట్ బిల్లులో ముద్రించిన నెంబర్‌ను సంప్రదించి సేవలు పొందవచ్చని తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన ఎమ్మెల్యే

- విద్యార్థినులతో కలిసి భోజనం చేసిన పాల్వాయి

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని కస్తూర్బ గాంధీ బాలికా విద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయడానికి సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు సందర్శించారు. గురువారం పాఠశాలకు వచ్చిన ఆయనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాగతం పలికారు. పాఠశాలకు ప్రధాన రహదారి, ప్రహరీ గోడ, క్రీడా ప్రాంగణం, పాఠశాల ఆవరణలో వర్షపు మురుగునీరు ఆగి ఉండడంతో దోమల బెడద, పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రభుత్వం ఆడపిల్లలను చదివిస్తుందని, తల్లిదండ్రులు, సమాజానికి మంచి పేరు వచ్చేలా చదువులో రాణించాలన్నారు. రాబోయే కాలమంతా మహిళాలదేనని, చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్‌తో ప్రతి చట్టసభలో మూడింట ఒక వంతు మహిళలే ఉంటారని తెలిపారు. వర్షాకాలం సందర్భంగా అనేక వ్యాధులు ప్రబలుతాయని, ముందస్తుగా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాఠశాలలోని సమస్యలను పరిష్కరించేల తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కోట ప్రసాద్, కేజీబీవీ ఇన్‌చార్జీ ఎస్ఓ మడావి శ్రీదేవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్, మాజీ జడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, మాజీ ప్లానింగ్ కమిటీ బోర్డు మెంబర్ కోంద్ర మనోహర్ గౌడ్, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



రెబ్బెన : సభ్యత్వం నమోదు చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ ప్రతినిధులు

నవతెలంగాణ-రెబ్బెన

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అనిల్ కుమార్, సదానందం డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 2024 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలంలోని నవేగాం జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు హాజరై సభ్యత్వం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెలలో బదిలీ ప్రక్రియ చేపట్టినప్పటికి ఉపాధ్యాయులను రిలీవ్ చేయలేదన్నారు. బదిలీ ఉపాధ్యాయుల స్థానంలో వీవీలను నియమించి, బదిలీఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులు లేక పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి వెంకటేష్, గురుపాదం, ప్రవీణ్, విజయ్ రవి, రజిత రోజారమణి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండలంలోని కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షులు గుండు యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జీఓ 317 ద్వారా సొంత జిల్లాలకు ఉపాధ్యాయులను పంపించాలని, ఇటీవల ప్రమోషన్‌లలో మిగిలిన పోస్టులను భర్తీచేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బండ ఉదయకిరణ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తాటి విజయనిర్మల, జిల్లా ఉపాధ్యక్షురాలు గంగాభవాని, మండల అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జాఫర్, సీనియర్ ఉపాధ్యాయులు బడే షాహెబ్, అత్మారాం, ఆఫ్తాబ్, సంతోష్, అర్షియా సుల్తానా, ప్రియాంక, అరుణ, భాగ్యలక్ష్మి, రామకృష్ణ, స్వప్న, రసజ్ఞ, సంతోష్, భారతీ, నాగరాని పాల్గొన్నారు.

కెరమెరి : జిల్లాలో పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాష్ అన్నారు. సభ్యత నమోదు వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు చేపట్టడంలో పీఆర్టీయూ టీఎస్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. రానున్న రోజుల్లో విద్యారంగంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్టీలు, ఉద్యోగ భద్రత ఇతర సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇందులో నాయకులు భరత్ కుమార్, సోము, భాస్కర్, చంద్రశేఖర్, దివ్యశ్రీ, మండల శాఖ అధ్యక్షుడు భరత్ రావు, శివ ప్రసాద్, అర్చన దేవి, జైవంత పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-సిర్పూర్(టీ)

ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షణీయమని ఆర్ఎంపీ, పీఎంపీలు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ వైద్యుడు దాస్ మాట్లాడుతూ 75 ఏండ్ల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటి వరకు మమ్మల్ని పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని, కాని ఇప్పుడు ముఖ్యమంత్రి మాత్రం ఆలస్యం చేయకుండా ఎలాంటి అనర్థాలు జరుగుక ముందే శిక్షణ ఇస్తామని తీపి కబురు ఇవ్వడం హర్షణీయమన్నారు. గుర్తింపు ఇచ్చేవిధంగా చర్యలు చేపట్టినందుకు మంత్రి సీతక్క, కుమురం భీం జిల్లా ఛైర్మెన్ కోనేరు కృష్ణారావు, సిర్పూర్ తాలూకా కాంగ్రెస్ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్, రాష్ట్ర సంఘం నాయకులు కోదండరామ్, జనవిజ్ఞాన రమేష్ తదితరులకు ధన్యవాదలు తెలిపారు. కార్ర్యమంలో సీనియర్ గ్రామీణ వైద్యులు అబ్రార్, లక్ష్మణ్, మండల కమిటీ అధ్యకుడు అజ్మీర ఉమేష్, కోశాధికారి పరమేశ్ ఆజ్జూ, షాకీర్, అమృత్, అషిం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.లక్ష రుణమాఫీ తమ ఖాతాలో జమచేయడంతో రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు జమల్‌పూరి సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందని, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల ఖాతాలో రూ.లక్ష జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దాదాజీ, మెంగాజీ, ప్రశాంత్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా గోపాల కాలా కార్యక్రమం

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

మండలంలోని వెంకటరావుపేట్ గ్రామంలో తొలి ఏకాదశి పురస్కరించుకొని గోపాల కాలా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజ చేశారు. ప్రతి ఏడాది తమ కుటుంబాలను ఆయురారోగ్యాలతో ఉండాలని గోపాల కళ నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. తొలి ఏకాదశి సమయంలో తమ పూర్వీకుల కాలం నుండి వర్షాలు బాగా కురవాలని పాడిపంటలతో తమ కుటుంబాలు సంతోషంగా ఉండాలని ఈ గోపాల కళను చేస్తున్నామన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | జులై 19, 2024 | www.navatelangana.com

బడికి దూరంగా..బతుకు భారంగా

నవతెలంగాణ-మంచిర్యాల



చిత్రంలో కనిపిస్తున్న పిల్లలు రాజస్థాన్ నుండి మంచిర్యాలకు వారి తల్లిదండ్రులతో కలిసి బొమ్మలు అమ్మేందుకు వచ్చారు. బొమ్మలు అమ్మే క్రమంలో తల్లిదండ్రులు విశ్రాంతి తీసుకుంటుండగా పక్కనే ఉన్న ఐలాండ్‌పై పిల్లలు ఇలా ఆడుకుంటున్నారు. సమయం దొరికినప్పుడల్లా ఇలా ఆటలు ఆడుతూ సరదగ గడుపుతున్నారు. వారి వయసు పిల్లలు అందరూ బడికి పోయి చదువుకుంటుంటే వీళ్ల మాత్రం ఇలా కుటుంబ సభ్యులతో సంచార జీవితాలు గడుపుతూ బ్రతుకు ఈడుస్తున్న తీరు స్థానికులను కలిచి వేసింది. ప్రభుత్వాలు ఇప్పటికైన ఇలాంటి పిల్లలపై దృష్టి సారించి బడిలో చేర్పించే కార్యక్రమలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి

నవతెలంగాణ-జైపూర్



ఇందారం గ్రామ పంచాయతీ పరిధి అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఊర్దూ మీడియం ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయినట్లు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఇందారం గ్రామాన్ని సందర్శించిన ఆయన అమ్మఆదర్శ పాఠశాల పరిసరాలను పరిశీలించి పారిశుద్ధ పనులు పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వైట్ వాషింగ్ తప్పా మిగితా పనులు పూర్తయినట్లు తెలిపారు. అదేవిధంగా ఇందారం ఆరోగ్య ఉప కేంద్రంలో కొనసాగుతున్న వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు

పోడు రైతులపై అటవీ అధికారుల అజమాయిషీ తగదు

• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-జైపూర్

మంచిర్యాల జిల్లా పరిధి కోటపల్లి మండల శివారు పోడు సాగు రైతులపై అటవీ అధికారుల దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సీపీఐ(ఎం), తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం సర్వాయిపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోడు సాగు రైతులపై అటవీ అధికారులు అత్యుత్సాహం చూపుతున్నారన్నారు. పోడుదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో అటవీ అధికారులు రైతులపై అజమాయిషి చేస్తున్నారని ఆరోపించారు. కోటపల్లి మండలం బొప్పారం శివారులో సాగు చేసిన పత్తి పంటను అటవీ అధికారులు గడ్డి మందు కొటి మొక్కలను నశనం చేసిన తీరును తీవ్రంగా ఖండించారు. పత్తి పంటను నష్టపర్చిన అధికారులపై విచారణ జరిపి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెన్నూర్ నియోజకవర్గంలో పేదలపై జరుగుతన్ను దాడుల పట్ల స్థానిక ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి జోక్యం చేసుకోవాలని, పేదల పట్ల సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కమిటి సభ్యులు దూలం శ్రీనివాస్, మండల నాయకులు కావేరి రవి, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏర్మ పున్నం, పోడు సాగుదారులు బానోతు రాజేశ్, బానోత్ ప్రశాంత్, బానోత్ రూపానాయక్, సురేష్, జెల్ల రజిత, కన్నవేణి మంగు, రత్న మణిమాల, మంద శ్రీకాంత్, మంద తిరుపతి పాల్గొన్నారు.

గంజాయి, డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-దండేపల్లి

గంజాయి డ్రగ్స్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని ఎస్ఐ ఉదయ్ కిరణ్ అన్నారు. గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్ మాయలో పడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఒక్కసారి డ్రగ్స్ వాడినా అది వ్యసనంగా మారే ప్రమాదం ఉందన్నారు. సినిమాల్లో మాదకద్రవ్యాల వినియోగం అనేది యువత పై ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. కళాశాల పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఎవరైనా గంజాయి సేవిస్తున్న విక్రయిస్తున్న సమాచారం ఉంటే పోలీసులకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఒక్కసారి కేసు నమోదు అయితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు రావని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణగొని శంకర్ గౌడ్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కళాకారులను ఆదుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ ధూంధాం కళాకారులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా నాయకులు లింగంపల్లి రాజలింగం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళాకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు లింగంపల్లి రాజలింగం, హనుమండ్ల మధు, కొండుకూరి రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ధూం ధాం కళాకారులను మోసం చేసిందని, ఈ రోజు కళాకారుల కుంటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హర్హులైన కళాకారులకు సారథిలో ఉద్యోగాలు కల్పించాలని, షూరిటి లేకుండా బ్యాంకు రుణాలు రూ.10 లక్షలు అందించాలని, 45 సంహాత్సరాలు నిండిన కళాకారులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందించాలని, ఇందిరమ్మ రాజ్యంలో కళాకారులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మామిడి లక్ష్మణ్, సోమ సంధ్య, ఆకుల నరేష్, ఆవునూరు సత్యం, కోల వెంకటేష్, కోరుట్ల రాజేష్, మామిడిపల్లి అశోక్, నాగిని రాజేందర్, టేకులపల్లి భోజన్న, కుదురుపాక నరేష్, కొల్లూరు రమేష్ పాల్గొన్నారు.

పాఠశాలకు గోడ గడియారాలు అందజేత

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ధర్మారావుపేట ఉన్నత పాఠశాలలో గురువారం మందమర్రి రిటైర్డ్ టీచర్ బొంకూరి అనసూయ 4వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు పాఠశాలకు గోడ గడియారాలు అందజేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అనసూయ ఎనలేని సేవ చేసిందని ఉపాధ్యాయులు కొనియాడారు. ప్రతి సంవత్సరం ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలను ఎంచుకొని సేవ చేయడం చాలా మంచి పరిణామమని హెచ్ఎం సుధాకర్ నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అరుణ్ ప్రదీప్, సంధ్య, కిరణ్ సందీప్, శృతి, వినయ కుమారి, బాబి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ • జన్నారంలో భారీగా ద్విచక్ర వాహన ర్యాలీ



జన్నారం : బైక్ ర్యాలీలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో నిలబెట్టుకున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసిన సందర్భంగా మండల కేంద్రంలో అంగడి బజార్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు రైతులు, కార్యకర్తలతో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. అనంతరం రైతులతో రైతు వేదికలో ముఖాముఖి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులకు ఏమీ చేయలేదన్నారు. ఎన్నికల ముందు రైతులకు వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి రైతుకు రూ. రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. రుణమాఫీ చేసి, నెల ఆఖరిలోపు రూ. 1,50,000, ఆగస్టులోపు ప్రతి రైతుకు రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్నారు. రైతులు ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు భయపడకుండా మోసపూరిత మాటలను నమ్మకూడదన్నారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మేనిఫెస్టోలో పెట్టిన విధంగా 6 గ్యారెంటీ స్కీములను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. కార్యక్రమానికి ముందుగా కామన్‌పల్లి గ్రామంలో పర్యటించి మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీత, ఏఈఓలు అక్రమ్ మధుకర్ త్రిసంధ్య, పోన్కల్ పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, నాయకులు మిక్కిలినేని రాజశేఖర్, గుర్రం మోహన్ రెడ్డి, సుభాష్ రెడ్డి, మామిడిపల్లి ఇంద్రయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముత్యం సతీష్, దుమల రమేష్, మహిళా నాయకురాలు లక్ష్మి, బండారి స్వామి, పంకజ, సహన బేగం, ఫసియుల్లా రియాజుద్దీన్, రాజన్న యాదవ్, లక్ష్మీనారాయణ, మంద రాజేష్ పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటానికి పాలాభిషేకం

మండలంలోని లోతరే గ్రామంలో రైతులు రుణమాఫీ చేసినందుకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తూ రుణమాఫీ చేయలేదన్నారు. కానీ రేవంత్ రెడ్డి రైతుల పట్ల ఎంతో కృషితో రెండు లక్షల వరకు రుణమాఫీ చేయడం ప్రతి రైతన్నకు మేలు జరిగేలా ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మండాడి ననేశ్వర్, కుర్సెంగా గంగారాం పటేల్, బహదూర్ షా, జగదీష్, యస్వంత్ రావు, నర్సింగరావు, రాజు పాల్గొన్నారు.

దండేపల్లి : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదేనిని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీల భాగంగా గురువారం రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించగా మండలంలోని ద్వారక రైతు వేదిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల భాగంగా రూ.2 లక్షల లోపు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకరం చూట్టి తొలి దశలో రూ.లక్ష రుణాలు మాఫీ అవుతాయని, రెండవ దశలో రూ.రెండు లక్షలలోపు ఉన్న రైతుల రుణాలు మాఫీ అవుతాయని అన్నారు. గత ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కానీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీతో పాటు వరికి మద్దతు ధర కూడా అందజేస్తామని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దండేపల్లి : పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

• బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

నవతెలంగాణ-తాండూర్

పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలు, పేద ప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీలను అమలు పరుస్తూ పేదల పక్షాన నిలిచిందన్నారు. ప్రభుత్వం రైతులు, మహిళలకు చేయూతనందిస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యం, సబ్సిడీ గ్యాస్ గృహలక్ష్మి పథకాలు మహిళల కోసం ప్రవేశపెట్టినవేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షాననిలిచి వారి అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ రైతులకు అందేలా చర్యలు తీసుకుంటుందన్నారు. లక్షలోపు రుణమున్న రైతుల ఖాతాలో జమవుతాయన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరిచే లక్ష్యంతో రైతుల రుణాలను మాఫీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మురళీధర్ రావు, అధ్యక్షులు ఈసా, మహేందర్ రావు, మాదారం మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్, సుందిళ్ల భూమయ్య, మాసాడి తిరుపతి, సేవాదళ్ నాయకులు గట్టయ్య, యువజన నాయకులు అనిల్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా మైన్స్ సేఫ్టీ అవార్డ్‌కు శ్రీరాంపూర్ ఓసీ

నవతెలంగాణ-నస్పూర్

ఆల్ఇండియా మైన్స్ సేఫ్టీ అవార్డ్స్‌కు శ్రీరాంపూర్ ఉపరితల గని ఎంపిక కావడం అభినందనియమని కమిటీ చైర్మన్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ మైనింగ్ సౌత్ సెంట్రల్ జోన్ హైదరాబాద్ బి వెంకన్న అన్నారు. గురువారం కమిటీ సభ్యులు అనురాగ్ శేఖర్ దుబే (జనరల్ మేనేజర్ వెస్టర్న్ కోల్డ్ లిమిటెడ్), రవీంద్ర పి గత్వార్(జనరల్ మేనేజర్ హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్), మనోరంజన్ మహలి(జనరల్ మేనేజర్ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్), సురేష్ మూర్తి (జనరల్ మేనేజర్ నైవేలి), డాక్టర్ రితేష్ (వెస్టర్న్ కోల్డ్ లిమిటెడ్), ఏరియా ఇన్‌చార్జీ జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌తో కలిసి ఓసీని సందర్శించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా నాలుగు గనులను ఆల్ ఇండియా మైన్స్ సేఫ్టీ అవార్డ్స్‌కు ఎంపిక చేయడం జరిగిందన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఉపరితల గనులలో రాంపూర్ ఏరియాలో శ్రీరాంపూర్ ఉపరితల గని ఎంపికైందన్నారు. అలాగే ఉపరితల గనిలో పనిచేస్తున్న ఇంజనీర్లు భారీ యంత్రాల్లో వినియోగించే ఆటోమేటిక్ ఫైర్ డిటెక్షన్ అండ్ సప్రెషన్ సిస్టం పనితీరును, ఎఫ్లియంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ పని విధానాన్ని గని అధికారులు వివరించారు. అదేవిధంగా ఉపరితల గనిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు సీపీఆర్‌ను కమిటీ సభ్యులకు వివరించి, విధానాన్ని కమిటీ సభ్యుల ముందు ప్రదర్శించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటారు. కమిటీ సభ్యులు శ్రీరాంపూర్ ఉపరితల గనిలో తీసుకుంటున్న రక్షణ పద్ధతులను అధికారులు కమిటీ సభ్యులకు వివరించారు. క్వారీలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ప్రదేశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా గనిలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే.వెంకటేశ్వర్ రెడ్డి, అపెక్స్ కమిటీ సభ్యులు ఏవీ రెడ్డి, గని మేనేజర్ బ్రహ్మజీ, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమ అధికారి బి.శంకర్, గని పిట్ కార్యదర్శి లచ్చన్న పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డిప్యూటీ డైరెక్టర్ వెంకన్న, అధికారులు

రెండో రోజు అమ్మ మాట అంగన్‌వాడీ బాట



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ద్వారకాపూర్ శివాజీ నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు అమృత, పావని అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంటర్ల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్య గురించి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. గర్భిణీలు, పిల్లలకు అంగన్‌వాడీ సెంటర్లలో పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. కేంద్రాల్లో ప్రయివేటు ప్లే స్కూళ్ల మాదిరి ఆటపాటలతో కూడిన ప్రీస్కూల్ విద్యను అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

• డీపీఓ వెంకటేశ్వర్ రావు



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కడా మురుగు నీరు నిల్వ కాకుండా జాత్రలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు ఆదేశించారు. గురువారం గ్రామ పంచాయతీని సందర్శించిన ఆయన డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహణ కల్పించాలని సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులు పరిశీలించి చెత్తా చెదారం లేకుండా చూడాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కన్పించకుండా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం టేకుమట్ల గ్రామాన్ని సందర్శించి రైతు వేదిక వద్ద కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఇందారం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుమన్, ఏఎన్ఎం క్రిష్ణవేణి, టేకుమట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణి ఉన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-నస్పూర్

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని నస్పూర్ ఎస్సై సుగుణాకర్ అన్నారు. గురువారం సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యసనం ఒక ప్రాణాంతక వ్యాధని, వ్యసనపరులు దీర్ఘకాలం పాటు దానికి బానిసై తమ ఉనికిని కోల్పోతున్నారని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడే యువత శారీరక రుగ్మతలకు లోనై, జ్ఞాపకశక్తి కోల్పోయి, విచక్షణ, విజ్ఞత కోల్పోయి నేరాలకు పాల్పడుతూ దురదృష్టవశాత్తు కేసుల్లో నిందితులుగా మారుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాలు వినియోగించడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల జీతభత్యాల పెంపుకు కృషి



నవతెలంగాణ-జైపూర్

జైపూర్ ఎస్టీపీపీ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారి జీతభత్యాల పెంపుకు సంబంధించిన అంశాన్ని వంద రోజుల్లో కొలిక్కి తీసుకోస్తానని ఐఎన్‌యూసీ నాయకుడు జనక్ ప్రసాద్ హామీ ఇచ్చారు. జైపూర్ ఎస్టీపీపీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ప్లాంట్ ప్రధాన ద్వారం ఎదటు ఐఎన్‌టీయూసీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా కార్మికుల పక్షాన వారి హక్కులు సాధించడం, సమస్యలు పరిష్కరించడం కోసం అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మెన్‌గా తనకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో సుమారుగా 200 మంది కార్మికులు పని చేస్తుండగా వారికి ఇవ్వాల్సిన వేజెస్, వెల్ఫేర్ అండ్ హెల్త్ విషయమై ముందు వరుసలో ఉండి పోరాడుతానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సింగరేణి ఎస్టీపీపీ అధ్యక్షులు పేరం రమేష్, ప్లాంట్ ఇన్‌చార్జ్ రాకేష్ గౌడ్, గాద శ్రీనివాస్, పిట్ కార్యదర్శి మధు, తొగరి కృష్ణ, ఎలుకంటి శ్రావణ్, రమేష్, మనోజ్, శ్రీనివాస్, మధూకర్, శివ రాంచందర్, రవితేజ పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

నవతెలంగాణ-కాసిపేట

ఏఐటీయూసీ నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. తెలంగాణలోని సింగరేణి బొగ్గు బావులను, కేంద్ర ప్రభుత్వం ప్రయివేట్ వారికి అప్పగించడానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టగా దానిలో భాగంగా రాజ్‌భవన్ ముట్టడి, ధర్నాకు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్, ఎసీసీడబ్ల్యూయూ అధ్యక్షులు సీతారామయ్యతో పాటుగా పలువురుని అరెస్ట్ చేసి హైదరాబాదులోని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ తరలించారన్నారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణపై గనులపై నల్ల బ్యాడ్జీలు పెట్టి నిరసన తెలిపిన, జీఎం ఆఫీస్ ముట్టడి, అన్ని జిల్లా కలెక్టర్లకు వినతిపత్రం అందించినా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో ఛలో హైదరాబాద్ చేపట్టామన్నారు. కానీ ప్రభుత్వం నాయకులను అరెస్టు చేశారన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అపలేరని స్పష్టం చేశారు.



మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మొక్కలు నాటడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదిక ఆవరణలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్క బతికేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన వన మహోత్సవంలో విరివిగా చెట్లు పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సురేందర్, డీఏఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

300 కిలోల పటిక స్వాధీనం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో గురువారం తనిఖీలు నిర్వహించి 300 కిలోల పటిక స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వి.రవి తెలిపారు. రామగిరి రైలులో పటిక రవాణా అవుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎక్సైజ్, జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించగా నాటుసారా తయారీకి ఉపయోగించే పటిక లభ్యమైనట్లు ఆయన వివరించారు.

అంగన్‌వాడీల్లో వసతులు కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. గురువారం జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి సీడీపీఓ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, మూత్రశాలల నిర్మాణాలు చేపట్టి అవసరమైన మరమ్మత్తు పనులను పూర్తి చేయాలని, పెయింటింగ్, పిల్లలకు అవసరమైన ఆట వస్తువులను సమకూర్చాలని తెలిపారు. జిల్లాలోని 11 కేంద్రాలను పూర్తి వినూత్నంగా ఆధునికరించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్య స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, సామ్-మామ్ పిల్లలను గుర్తించి సాధారణ స్థితికి వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. మరమ్మత్తులు, నిర్మాణ పనులకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించి అందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

అధికారిక సమావేశాలలో సభ్యత్వాలు చేయడమా?

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో గురువారం కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారని, ఈ సమావేశాలలో సంఘ సభ్యత్వాలు చేయించడం ఎంతవరకు సమంజసమని, ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందూరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశాలలో నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులే తమ పరిధిలోని ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వం తీసుకోవాలంటూ ఒత్తిడి తెచ్చి మరీ సభ్యత్వం చేయించారని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పై స్థాయి వారు సభ్యత్వం తీసుకోవాలని ఒత్తిడి తేవడంతో వారి నుండి ఎలాంటి ఇబ్బందులు వస్తాయో అని కొంతమంది ఉపాధ్యాయులు తప్పనిసరి పరిస్థితులలో సభ్యత్వం తీసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై వెంటనే డీఈఓ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఎస్పీని సన్మానించిన ట్రస్మా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇటీవల నూతనంగా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీవీ శ్రీనివాస్ రావును తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం(ట్రస్మా) నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛమిచ్చి శాలువ, జ్ఞాపికతో సన్మానించారు. ఈ సందర్భంగా పలు సమస్యలు వారి మధ్య చర్చకు వచ్చాయి. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు పరదేశీ దేవభూషణం, గౌరవ అధ్యక్షుడు పెద్దపల్లి కిషనరావ్, ప్రధాన కార్యదర్శి తిరుపతి చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిక్కొండ సంజీవ్ కుమార్, స్పోక్స్ పర్సన్ నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ జమీల్, జిల్లా ఉపాధ్యక్షులు ఆలుగొట్టు తిరుపతి, రావణ్ బొరాయి, మిరాజ్ హుస్సేన్, కాగజ్‌నగర్ డివిజన్ ప్రెసిడెంట్ ఎస్ఆర్ సంతోష్, ప్రధాన సలహాదారులు గోపాల్, మహేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శులు మాలిక్, రాధాకృష్ణ చారి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కెరమెరి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీడీ రమాదేవి అన్నారు. గురువారం మండలంలోని అనార్పల్లి ఆశ్రమ, మోడీ ఆశ్రమ పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదిలో కలియ తిరుగుతూ విద్యా బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పలు అంశాలపై విద్యార్థుచే సమాధానాలను రాబట్టారు. డీడీ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి చెందారు. అనంతరం తరగతి గదులతో పాటు స్టోర్ రూమ్ భోజనశాల, స్టాక్ రూములను పరిశీలించారు. విద్యార్థుల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సైబర్ మోసాలు అధికమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఏదో ఒక బ్యాంకు పేరిట, వాట్స్ యాప్ ప్రొఫైల్ బ్యాంకు పేరు, బ్యాంక్ పిక్చర్ లోగోతో వాట్స్ యాప్‌లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని దీన్ని అంగీకరించినట్లయితే వాట్స్‌అప్ సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళ్ళిపోతుందని తెలిపారు. ఫోన్ హ్యాక్ అయితే పోలీసులకు సమాచారం అందించాలని, దీని కోసం 1930కు ఫోన్ చేయాలని లేదా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్ క్రైమ్.జీఓవీ.ఇన్ ద్వారా రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నవతెలంగాణ-భైంసా

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించి, భావితరాలకు బాసటగా నిలవాలని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. గురువారం భైంసా పట్టణంలోని గోశాలలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాతావరణం కలుషితం కాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ, ప్రతి ఇంట మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమాన్ని ప్రారంభించారని అన్నారు. వృక్ష సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అడవుల నరికి వేయడంతోనే పర్యావరణంలో మార్పులు వస్తున్నాయని పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే మార్గమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బి.గంగాధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోపాల్ సర్దా పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి రైతుకు రుణమాఫీ అందాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రైతు రుణమాఫీ పథకం ఫలాలు జిల్లాలో అర్హత గల ప్రతి రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషితో కలిసి బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1 లక్ష 35 వేల మంది రైతులు రుణమాఫీ పొందడానికి అర్హత కలిగి ఉన్నారని, మొదటి విడతలో లక్ష రూపాయల లోపు రుణమాఫీ పొందే రైతులు 22 వేల మంది ఉన్నారని, వీరికి గురువారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చువల్ విధానం ద్వారా రైతు రుణమాఫీ పథకాన్ని ప్రారంభించారన్నారు. బ్యాంకు అధికారులు రైతు ఖాతాలలో జమ అయిన మొత్తాన్ని ఎలాంటి షరతులు లేకుండా రైతులకు అందించాలని, ఇతర రుణాలతో ఈ నగదుకు సంబంధం లేకుండా జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా రుణమాఫీ మొత్తాన్ని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నస్పూర్ : రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వ్యవసాయ రంగం కీలకమని, రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. రైతు రుణమాఫీ పథకం అమలులో భాగంగా గురువారం కలెక్టర్ కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ అపర్ణ రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ లతో కలిసి బ్యాంకు నోడల్ అధికారులు, కంట్రోలర్లు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తుందని, ఈ క్రమంలో జిల్లాలోని అర్హత గల రైతులకు లబ్ది చేకూరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పథకం గురించి రైతుల సందేహాల నివృత్తి, ఇబ్బందులను పరిష్కరించడానికి మండల స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేసింది

- కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీకి కట్టుబడి రుణమాఫీ చేసింది
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



నవతెలంగాణ-జైపూర్

పదేండ్ల తెలంగాణాలో ప్రభుత్వాన్ని నడిపిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారన్ని చేపట్టిన బీజేపీ రైతులను నిర్లక్ష్యం చేసిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పంట రుణాల మాఫీ పథం ప్రారంభోత్సవాన్ని గురువారం మండలంలోని టేకుమట్ల రైతు వేదికలో రైతులతో కలిసి వీక్షించారు. రుణమాఫీ విషయమై సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వార తిలకించిన అనంతరం మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని ప్రారంభించిదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. అనంతరం నాయకులు, రైతులతో కలిసి బాణాసంచ పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్, నాయకులు రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, చల్ల సత్యనారాయణ రెడ్డి, చల్ల విశ్వంబర్ రెడ్డి, ఎల్కంటి శ్రీనివాస్ రెడ్డి, రిక్కుల లక్ష్మీనారాయణ రెడ్డి, గుండు తిరుపతి పాల్గొన్నారు.

భీమారంలో...

భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదిక ద్వార స్థానిక నాయకులతో కలిసి మండల ప్రత్యేక అధికారి చిన్నయ్య, ఎంపీఓ శ్రీపతి బాపు, వ్యవసాయ విస్తరణ అధికారి అరుణ్‌లు సీఎం సందేశాన్ని తిలకించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అత్యధికంగా పాల్గొన్నారు.

తాండూర్ : వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకే రైతులకు రుణమాఫీ వర్తింపజేయడం జరిగిందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోదన్నారు. గురువారం బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామపంచాయతీలోని రైతు వేదికలో నాయకులతో కలిసి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. అనంతరం రైతు రుణమాఫీపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రుణమాఫీ ప్రారంభోత్సవ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాజీవ్ నగర్ పంచాయతీలో వనమహోత్సవంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ నాతారి స్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, బండి ప్రభాకర్ పాల్గొన్నారు

వేమనపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయడాన్ని స్వాగతిస్తూ గురువారం మండలంకేంద్రంతో పాటు నీల్వాయి, ముల్కలపేట, కేతనపల్లి, గొర్లపల్లి గ్రామాలలో రైతులు సంబరాలు చేసుకున్నారు. మాజీ జడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ షాబీర్ అలీ ఆధ్వర్యంలో బాణసంచా పేల్చి, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ముజ్జు, మాజీ సర్పంచ్ గాలి మధు, మాజీ వైస్ ఎంపీపీ ఒడిల రాజన్న, మాజీ సర్పంచ్ ఆవులమారి దుర్గక్క, నాయకులు తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబుకు సీఐటీయూ అనుబంధ తెలంగాణ ఐకెపి వీఓఏ ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. కనీస వేతనం ఇవ్వాలని, గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలని, ప్రతీ గ్రామ సంఘానికి ల్యాప్‌టాప్ అందించాలని, జీఓ నెం. 58ను సవరించాలని, మూడు నెలల రెన్యువల్ పద్ధతిని రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచుతామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు శేరిశెట్టి శ్రీనివాస్‌గౌడ్, ఎం అంకయ్య, జె ధన్‌రాజ్, రత్నం శ్రీనివాస్, జాడి అనిల్‌కుమార్, ఎం అనిత, డి తిరుపతి, ఎ సతీష్, ఎ తిరుపతి పాల్గొన్నారు.

డిగ్రీ గురుకుల కళాశాలను కొనసాగించాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

జిల్లా కేంద్రానికి తరలించిన మహిళ డిగ్రీ గురుకుల కళాశాలను ఇచ్చోడలోనే కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చోడ మహిళ డిగ్రీ కళాశాల 2017లో మూడు ప్రాంతాలకు అనుగుణంగా ఉన్న ఇచ్చోడలో కొనసాగింది. అయితే కొంతమంది అధికారులు వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం జిల్లా కేంద్రానికి తరలించారని అన్నారు. గతంలో ఇచ్చోడ కేంద్రంలో ఉన్న భవనానికి అన్ని సదుపాయాలు, సౌకర్యాలు కలిగి ఉండి ఏ రకమైనటువంటి ఇబ్బందులు లేకుండా తక్కువ రెంట్‌తో కొనసాగిస్తే, నాలుగింతలు రెంటును అదనంగా చెల్లించి అదిలాబాద్‌కు తరలించడంలో సోషల్ వెల్ఫేర్ ఆర్‌సీఓ, ప్రిన్సిపాల్‌తో పాటు కొంతమంది సిబ్బంది అకారణంగా తరలించినందున వారిపై సమగ్ర విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వారికి అనుకూలంగా ఉండటం కోసం ఇచ్చోడ నుంచి జిల్లా కేంద్రానికి తరలించడం జరుగుతుందని అన్నారు. దీనివలన సుదూర ప్రాంతం నుంచి ఇచ్చోడకు చుట్టుపక్కల సుమారు పది మండలాలకు అనుకూలంగా ఉండి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సరైన రవాణా సౌకర్యాలను అందకుండా నిర్లక్ష్యం చేయడం కోసం కుట్రబుద్ధితో తరలించిన కళాశాలను తిరిగి యధావిధిగా ఇచ్చోడలోనే కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాదిగ విద్యార్థి సమైఖ్య జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షులు బరుకుంట సుభాష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చిట్టి రవి, పట్టణాధ్యక్షులు దుబ్బాక చంటి, మండల నాయకులు సుంకే అనిల్, మచ్చ నగేష్, మడుగం పెళ్లి వెంకటేష్ పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నేరడిగొండ

తెలంగాణ రాష్ట్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జులై 26, 27, 28, తేదీల్లో హైదరాబాద్ ఎల్బీనగర్ కేబీఆర్ కన్వేషన్ హాల్లో ఫోటో ఎక్స్‌పో నిర్వహించడం జరుగుతుంది. గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో మండల ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్ల పండుగ అయినటువంటి ఎక్స్‌పో పోస్టర్‌లను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక ఫోటోగ్రాఫర్ల పండుగ అయినటువంటి ఎక్స్‌పోకు రావాలని పండగను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు, ప్రధానకార్యదర్శి, పేరుమాండ్ల సురేష్, ఉపాధ్యక్షులు జాదవ్ సంతోష్, కోశాధికారి గుడిసె వినోద్, సంయుక్త కార్యదర్శి కాడవేని కృష్ణ, లకవతుల శేఖర్, ప్రవీణ్, మద్దెల సాయి, అనిల్, సాయిరాం, సందీప్, సాయికిరణ్, ఫోటోగ్రాఫర్ సభ్యులు పాల్గొన్నారు.

పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జులై 2023 నుండి ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని 50 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని భట్టుపల్లి, సర్సిల్క్ జిల్లా పరిషత్ ఉన్నత బాలుర, బాలికల పాఠశాలల్లో గురువారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని, ప్రతి పాఠశాలలో స్వచ్ఛ కార్మికులను నియమించాలని, రాష్ట్రంలో ఉన్న మండల విద్యాధికారుల పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, 317 జీఓ ద్వారా ఇతర జిల్లాలకు కేటాయించిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు కేటాయించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎనగంటి బిక్షపతి పత్తిపాక శ్రావణ్ కుమార్, నాయకులు మడావి హనుమంతు, బైరి వరలక్ష్మి, జాడి దేవాజీ, మంజంపల్లి రమేష్, భువనగిరి శశికాంత్, నరులే ప్రకాష్, గణపురం సంపత్ కుమార్ పాల్గొన్నారు.

సర్కిల్‌లో..

కాగజ్‌నగర్ మండలంతో పాటు పట్టణంలోని సర్‌సిల్క్ పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, కాగజ్‌నగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రావణ్‌కుమార్ గురువారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మడావి హన్మంతు, బైరి వరలక్ష్మి, జాడి దేవాజీ, ఎం రమేష్, శశికాంత్, నరులె ప్రకాష్, గణపురం సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఆశాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆశా వర్కర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం చెన్నూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు వివేక్, ప్రేమ్ సాగర్ రావు ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. కనీస వేతననికి నోచుకోని ఆశ కార్య కర్తలు ఏండ్ల నుండి వెట్టి చాకిరీ చేస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చి, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ శోభ, పద్మ, విజయలక్ష్మి, సరోజ, రాణి, హైమవతి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్

నవతెలంగాణ-తాండూర్

నేరాలను నియంత్రించేందుకే కార్డెన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. గురువారం తెల్లవారుజామున సుభద్ర కాలనీలో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చట్టాలపై అవగాహన కల్పించారు. చట్ట వ్యతిరేక కార్యకలాకు గ్రామస్తులు సహకరించవద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్సై కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కోమటిచేను శివారులో భూ వివాదం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను శివారులో గురువారం భూ వివాదం చోటు చేసుకుంది. భూమికి సంబంధించిన మోక విషయంలో రెండు గ్రూపుల మధ్య ఇటీవల కాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి. రెండు వర్గాల వారికి పట్టాలు ఉండగా భూమికి సంబంధించి సరైన మోక లేదని గొడవలు పెట్టుకుంటున్నారు. ఇద్దరికి వేర్వేరు సర్వే నెంబర్లలో పట్టాలుండగా ఈ భూమి మాదంటే, మాదని గొడవలు పడుతున్నారు. దీంతో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. భూమికి సంబంధించి రెవెన్యూ అధికారులు పరిశీలించి భూమి మోకపై ఫైనల్ చేసే వరకు ఎవరూ గొడవలు పెట్టుకోవద్దని సూచించారు.

కొత్తపెల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-తాండూర్

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా శనివారం కొత్తపెల్లి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. వ్యవసాయ అధికారి కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, ఏఈఓ పుష్ప, ధనలక్ష్మి, శంకర్, రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని కాసిపేట మోడల్ స్కూల్, కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం, వాటి వల్ల కలిగే నష్టాలపై ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అవగాహన కల్పించారు, దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవాపూర్ కుమురంభీం చౌక్ దగ్గర దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎస్ఐలు ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలపై అవగాహన ప్రతి ఒక్కరికి ఆవసరమని, గంజాయి మాదక ద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా గంజాయి అమ్మినా, వాడినా తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అందె నాగ మలయ్య, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తు పాఠశాలకు కుర్చీల అందజేత

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్‌లో పనిచేసే బదిలీపై వెళు న్న టి. అరుణశ్రీ అనే ఉపాధ్యాయురాలు పాఠశాల అభివృద్ధిలో భాగంగా తన వంతు సాయంగా మూడు కుర్చీలను అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్. సునంద మాట్లాడుతూ బదిలీలు సహజమని ఎక్కడికి వెళ్లినా బాధ్యతతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తనతో పాటే ఉపాధ్యాయురాలిగా పనిచేసే బదిలీపై వెళ్తున్న సందర్భంగా పాఠశాల తరపున సన్మానించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి ఆర్ఎంపీల పాలాభిషేకం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్ఎంపీల సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన నేపథ్యంలో ఆర్ఎంపీల సంఘం జిల్లా నాయకుడు రూప్నర్ రమేష్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేయగా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీల సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎంపీల సంఘం నాయకులు శ్రీనివాస్, దాస్, ప్రవీణ్, అశోక్, దిలీప్, అజ్జు, ఉమేష్, భిక్షపతి, రెబ్బెన శ్రీనివాస్ పాల్గొన్నారు.

టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లోని మూడో నెంబర్ ప్లాట్‌ఫాంపై టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. గురువారం స్టేషన్ చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కైలాష్‌కు వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుండి మూడో నెంబర్ ప్లాట్‌ఫాం వద్దకు నేరుగా వచ్చే వీలుందని, కాని ఈ ప్లాట్‌ఫాంపై టిక్కెట్ కౌంటర్ లేకపోవడంతో ప్రయాణీకులు వ్యయప్రయాసలతో మళ్లీ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపైకి వెళ్లి టిక్కెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వృద్ధులు, గర్భిణీలు, పిల్లల సౌకర్యార్థం స్టేషన్‌లో లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య, నాగేశ్వర్‌రావు, ఎల్లాగౌడ్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.